క్లుప్తంగా

## సిద్ధార్థలో యోగా డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అడ్మిషన్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):తమ కళాశాలలో యోగా ఎడ్యుకేషన్‌లో డిప్లమో కోర్సులో ప్రవేశానికి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యార్హత కలిగి ఉండాలని, ఈ కోర్సులో ప్రవేశానికి ఎటువంటి వయో పరిమితి లేదని పేర్కొన్నారు. ఈ కోర్సులో భాగంగా రోజూ సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు తమ కళాశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో తరగతులకు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, క్రీడాకారులు కూడా కోర్సులో ప్రవేశానికి అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9963992102, 8125789666 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని గాంధీ బావి బూస్టర్‌లోని గేట్‌వాల్వ్ పాడైనందున వాటి మరమ్మతుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్కిల్-1 పరిధిలోని శ్రీనివాసమహల్, గాంధీ బావి, చేపలమార్కెట్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే బ్రాహ్మణ వీధి, చేపలమార్కెట్, మహంతిపురం, సుబ్బరామయ్య రోడ్డు, కొత్తపేట కొండప్రాంతం, సుబ్రమణ్య గుడి ప్రాంతంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం నుంచి 13వ తేదీ ఉదయం వరకు మరమ్మతులు జరుగుతాయని చెప్పారు. ఆ సమయాల్లో తాగు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. మరమ్మతులు అయ్యిన వెంటనే 13వ తేదీ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఈ పాక్షిక అంతరాయంకు నగరవాసులు సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతాల వాసులు ముందుగానే నీటిని నిల్వచేసుకుని వీఎంసీ సిబ్బందికి సహకరించాలన్నారు.

## ఆర్‌ఎంఎస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):విజయవాడ రైల్వేస్టేషన్ ఆరో నెంబర్ ప్లాట్‌ఫాంలోని ఆర్‌ఎంఎస్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. తపాలశాఖ పోస్ట్ మాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధరమూర్తి బుధవారం రిబ్బన్ కట్ చేసి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రం ద్వారా రైల్వే ప్రయాణికులు, దగ్గరలోని ప్రజలు వారి ఆధార్ నూతన నమోదులు, సవరణలు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం బాల సరస్వతి, అధికారులు, ఇబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపక సభ్యులు మాగంటి సరోజనీదేవి సంస్మరణ సందర్భంగా అమ్మ అంశంగా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మ ప్రేమ వెలకట్టలేమన్నారు. మహిళా జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్, చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్ రాజు, బీ వీరభద్రరావు, చావా నరసింహారావు, జోషి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాన్‌లో డబ్బులు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):వ్యాన్‌లో భద్రపరిచిన డబ్బులు తీసుకుని పరారైన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన కూరగంటి గోపి అదే ప్రాంతంలో ఉన్న త్రివేణి చికెన్ షాపులో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గోపితో పాటు చందు అనే యువకుడు హెల్పర్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో గోపి, చందులకు యజమాని జీతం కింద రూ. 42 వేలు ఇచ్చాడు. రాత్రి ఏలూరులో కోళ్లను లోడ్ చేసుకుని విజయవాడకు వచ్చారు. వైఎస్సార్ కాలనీలో కోళ్లను అన్‌లోడ్ చేసేందుకు వెళుతూ పాముల కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వ్యాన్‌ను నిలిపారు. పొలాల్లోకి వెళ్లిన కొంత సమయం తర్వాత నలుగురు వ్యక్తులు మోపెడ్‌పై వచ్చి వ్యాన్ డ్యాష్‌బోర్డులో ఉన్న డబ్బులు తీసుకొని వెళ్లిపోవడం గమనించారు. దీంతో కేకలు వేస్తూ వారి వెంట పడినా ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా రహదారి మలుపు!

- డేంజర్ బెల్స్ మోగిస్తున్న వైనం
- వాహనాల అతి వేగంతో మలుపులో ప్రమాదాలు
- వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు నిల్
- మలుపులో దెబ్బతిన్న కల్వర్ట్ అంచు



ప్రమాదకరంగా ఉన్న మలుపు

భవానీపురం(విజయవాడపశ్చిమ):గొల్లపూడి అట్కిన్సన్ స్కూల్ రోడ్డు చివర ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా ఆ మలుపు మృత్యు పిలుపుగా మారుతుంది. రోడ్డు విశాలంగా ఉండటంతో భారీ వాహనాలు సైతం మితిమీరిన వేగంతో ప్రయాణించడమే అందుకు నిదర్శనంగా నిలుస్తుంది. మలుపు వస్తుందని తెలిసినా వాహనాలు వేగాన్ని తగ్గించకుండా టర్నింగ్ కొట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాల డ్రైవర్లు స్టీరింగ్ కంట్రోల్ చేసుకోలేక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా లోడుతో ప్రయాణించే భారీ వాహనాలుకూడా మలుపులో వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో బోల్తా పడుతున్నాయి. వాటిల్లోని సరుకు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడిన ఘటనలు అనేకం. గతంలో హైదరాబాద్ నుంచి కారులో విజయవాడ వస్తున్న దంపతులు ఈ మలుపులోనే వేగాన్ని కంట్రోల్ చేసుకోలేక పోవడంతో బోల్తాపడి పక్కనే ఉన్న పంట కాలువ బోదెలోకి వెళ్లి పోవడం, వెంటనే కారులో నుంచి మంటలు రావడం జరిగిపోయాయి. అదృష్టవశాత్తు ఆ దంపతులు అప్రమత్తులై బోల్తాపడిన కారులో నుంచి అతి కష్టంపై బయటకు రావడంతో ప్రాణ గండం తప్పింది. డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఈ మలుపులో ప్రమాదాలు నిత్యకృత్యమైనా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు శూన్యం.

**విజయవాడ సిటీలోకి వచ్చే వాహనాల మళ్లింపు ఇక్కడే....**

హైదరాబాద్ వైపు నుంచి 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా విజయవాడ నగరంలోకి వచ్చే వాహనాలను గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని అట్కిన్సన్ స్కూల్ రోడ్‌లోకి పోలీసులు మళ్లించారు. ఆ రోడ్ చివర ఉన్న ప్రమాదకరమైన మలుపు దాటుకుని ఊర్మిళానగర్ - కబేళా సెంటర్ నుంచి చనుమోలు వెంకట్రావు (సీవీఆర్) ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించి చిట్టినగర్‌లోకి రావల్సి ఉంటుంది. అక్కడ నుంచి విజయవాడ నగరంలో ఎక్కడికైనా వెళ్లవచ్చు. హైదరాబాద్ వైపు నుంచి సాధారణ లారీలు, 10-12 టైర్ల లారీలు, కంటైనర్లు, ట్రాలీలు వంటి భారీ వాహనాలన్నీ అట్కిన్సన్ స్కూల్ రోడ్ మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. అదే సమయంలో కబేళా వైపు నుంచి అట్కిన్సన్ స్కూల్ రోడ్‌లోకి వచ్చే వాహనాలు ఎదురు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికలోడు, మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు మలుపుల్లో ఎంతో జాగ్రత్తగా వెళ్లాల్సి ఉండగా డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనేది సుస్పష్టం.



మలుపులో దెబ్బతిన్న కల్వర్ట్ అంచు

### వాహనాల వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు ఏవీ....?



మలుపు మీదుగా వెళుతున్న టిప్పర్లు

ఇటు అట్కిన్సన్ స్కూల్ రోడ్‌లో నుంచి అటు కబేళా సెంటర్ వైపు నుంచి వాహనాలు మలుపు దగ్గరకు వచ్చే ముందే స్పీడ్ బ్రేకర్లుగానీ లేదా జిగ్‌జాగ్ బారికేడ్లు లేకపోవడంతో డ్రైవర్లు వేగాన్ని నియంత్రించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా మలుపులో ఉన్న కల్వర్ట్ అంచు దెబ్బతిని ఉండటంతో అక్కడ వేగంగా టర్న్ అయ్యే వాహనాలు సరిగ్గా కల్వర్ట్ అంచుమీదుగా ప్రయాణిస్తున్నాయి. ఆ సమయంలో బైక్‌లు స్కిడ్ అయ్యి మురుగు గుంతలోకి వెళ్లిపోయి గాయాలపాలవుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపులో తరచూ యాక్సిడెంట్లు జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా అనేక వ్యాపార సంస్థలు జిగ్‌జాగ్ బారికేడ్లను పోలీసులకు స్పాన్సర్ చేస్తున్నప్పటికీ అత్యవసర ప్రాంతాల్లో పెట్టకుండా నిరుపయోగంగా ఉంచేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# అత్యున్నత ప్రమాణాలే వైద్యుల లక్ష్యం

**ఏఐసీటీఈ ఎక్స్‌పర్ట్ మెంబర్, నాక్ పీర్ టీమ్ చైర్మన్ డాక్టర్ శిద్ధయ్య**



శిద్ధయ్యను సత్కరిస్తున్న వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు):అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యంగా కృషి చేయాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్, ఏఐసీటీఈ ఎక్సర్ట్‌మెంబర్, నాక్ పీర్ టీమ్ చైర్మన్ డాక్టర్ తుమ్మలూరి శిద్ధయ్య తెలిపారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్లో అధునాతన టెక్నాలజీ-వైద్య విద్యలో అన్వయించటం-జాతీయ విద్యావిధానం-2020పై బుధవారం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్స్, ఇతర కళాశాల నిర్వహణ మండలి ప్రతినిధులు పాల్గన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా తుమ్మలూరి సిద్ధయ్య హాజరై మాట్లాడారు. కృత్రిమమేథ, ఏఐ టూల్స్ వంటివి ఉపయోగించుకుని సులభంగా వైద్య సేవలు అందించే సృజనాత్మక టెక్నాలజీ నేడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వైద్య సేవలను గతంతో పోలిస్తే ఇప్పుడు అత్యంత సులభంగా అందించే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. నేడున్న టెక్నాలజీ ప్రభావంతో వైద్య విద్యలో సరికొత్త పద్ధతులు, చికిత్సలు, పాటించాల్సిన విషయాలపై అవగాహన పెంపొందటానికి విపరీతమైన వైద్య విజ్ఞాన సంపద కూడా అందుబాటులో ఉందన్నారు. ఆయా టెక్నాలజీ, వైద్య పద్ధతులను ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవటం ద్వారా రోగులకు మెరుగైన, నాణ్యమైన, వేగవంతమైన చికిత్సలు అందించే అవకాశం ఉందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వైద్య కళాశాలల్లో ల్యాబ్స్, ఆపరేషన్ థియేటర్లు, ఇతర మౌళిక వసతులు పెంచుకోవటం ద్వారా రోగులకు మంచి సాంత్వన ఇచ్చే అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులతో వైద్యుడు వ్యవహరించాల్సిన తీరుతో పాటు నైతికతను ఒక అంశంగా వైద్యవిద్యలో చేర్చారని గుర్తుచేశారు. వైద్యవిద్య పూర్తి చేసుకుని బయటకు వచ్చే విద్యార్థి మంచి వైద్యుడిగా సేవలందించేలా ఇది ఉపకరిస్తుందని వివరించారు. దేశంలోని అత్యుత్తమ వైద్య కళాశాలలకు నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు ఇస్తుందని వాటిని కాపాడుకోవాలని కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, ఆర్అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ, రీసెర్చ్ విభాగం కమిటీ సభ్యులు డాక్టర్ తుమ్మల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క క్షణం.. ఆలోచించండి

**సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు**



ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, డాక్టర్ రాఘవరావు, డాక్టర్ అనిల్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):జీవితంలో ఒడిదుడుకులు సాధారణమే అని, వాటిని తట్టుకుని ముందుకు సాగితేనే లక్ష్యాలు సాధించగలమని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. పరీక్ష తప్పాననో, కుటుంబ కలహాలు, వ్యాపారంలో నష్టాలు వంటి వాటితో ఆత్మహత్యలకు పాల్పడాలనుకునే సమయంలో ఒక్కక్షణం ఆలోచిస్తే, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటారని చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ వైద్య కళాశాల మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, ఒత్తిడిలేని వాతావరణం ఉన్నత విద్యకు అవసరమని తెలిపారు. ఏదైనా మానసిక సమస్యలు ఎదురైనపుడు తనను స్వయంగా కలవాలని, తమ చాంబర్ విద్యార్థుల కోసం ఎప్పుడూ ఓపెన్‌గా ఉంటుందని వెల్లడించారు. మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ రాఘవరావు మాట్లాడుతూ ఆత్మహత్యలకు గల కారణాలు, నివారణ చర్యలు వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజీ, పిడియాట్రిక్ హెచ్‌ఓడీలు డాక్టర్ కేశవచంద్ర, డాక్టర్ పి. అనిల్‌కుమార్, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ సూర్యమంగాదేవి, మానసిక విభాగ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నరేష్, డాక్టర్ తార పాల్గొన్నారు. ఈ ర్యాలీలో వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ

**సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు**



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బి.రాఘవులు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు):భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఐలమ్మ 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులలర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ తెలంగాణ గౌరవం కోసం, దళిత బహుజనుల హక్కుల కోసం పోరాడిన వీరమాత ఐలమ్మ అని కొనియాడారు. ప్రజలందరూ కలసి ఆమె ఆలోచనలను ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటంలో భూములన్నింటినీ దున్నేవాడికి పంచాలంటే, నేడు పాలకవర్గాలు భూములన్నీ కార్పొరేట్ సంస్థలకు కట్టపెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ రజాకారులకు, నైజాం సర్కార్‌కు ధైర్యంగా ఎదురొడ్డి నిలబడ్డ వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో మహిళలందరూ ముందుకు నడవాలన్నారు. ప్రజాసంఘాల నాయకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధురాలిగా, దళిత బహుజనుల ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు. సమాజంలో అసమానతలు, కులవివక్షతలను నిర్మూలించే దిశగా ఆమె మార్గదర్శకం మనకు దిక్సూచి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డి, కిలారి సురేష్, ఏ.మాల్యాద్రి, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌కు అన్వర్ ఎంపిక



చిదంబరం తదితరుల నుంచి ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న అన్వర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 26 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న ఆలిండియా అడ్వకేట్స్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీకి విద్యాధరపురానికి చెందిన అడ్వకేట్ డాక్టర్ అన్వర్ షేక్ ఎంపికయ్యారు. హైకోర్ట్ అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.చిదంబరం, వైస్ ప్రెసిడెంట్ కేవీ రఘువీర్, జనరల్ సెక్రటరీ సి.సుభోత్, డెజిగ్నేటెడ్ సీనియర్ అడ్వకేట్ వేములపాటి పట్టాభి అన్వర్‌కు ప్రెసిడెంట్ చాంబర్‌లో బుధవారం ఎంపిక పత్రం అందజేశారు. నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ (నాక) ఆధ్వర్యంలో గత నెలలో గుంటూరులో 13 జిల్లాలకు సంబంధించి నిర్వహించిన సెలక్షన్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు డాక్టర్ అన్వర్ షేక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షులు మాగంటి లక్ష్మణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ నార్ల రమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ కోడి శ్రీనివాసరావు అన్వర్ షేక్‌ను అభినందించారు. న్యాయవాదుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని, ఏపీ తరుపున ఢిల్లీ గడ్డపై హైకోర్టును రిప్రజెంట్ చేసి విధంగా ఆడి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## డ్రెయిన్లు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని గంజి యలమందయ్య వీధి పక్కన రేషన్ షాప్ సందులో రూ.9,88,000 వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్స్, సీసీ రోడ్ రోడ్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అదే విధంగా నాలుగు స్తంభాల సెంటర్‌లోగల నాగేంద్రస్వామి గుడి కొండపై రూ.7,41,000 ఖర్చుతో నిర్మించనున్న సైడ్ వాల్ ఎత్తు పెంపు, మెట్లు, సైడ్ డ్రెయిన్స్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు మైలవరపు దుర్గారావు, వీరంకి సత్యనారాయణ, ఏఇ రామకృష్ణ, సచివాలయ ఇమ్యూనిటీ సెక్రటరీ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పద్యనాటక వైభవాన్ని చాటిన 'సత్యహరిశ్చంద్రీయం'



విజయవాడ కల్చరల్: శ్రీశారదా కళాసమితి, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో బుధవారం ప్రదర్శించిన సత్యహరిశ్చంద్రీయం నాటకం ఆద్యంతం పద్యనాటక వైభవాన్ని చాటింది. సత్య హరిశ్చంద్రుడిగా డాక్టర్ నరాల శెట్టి రవికుమార్, చంద్రమతిగా డాక్టర్ రత్నశ్రీ, విశ్వామిత్రుడిగా ఆచంట బాలాజీనాయుడు, నక్షత్రకునిగా గుర్రపుశాల శీను, లోహితాశ్యునిగా బాబు పాత్రోచితంగా నటించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారదా కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు మాట్లాడుతూ తెలుగు నాటకానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. నీలం దుర్గారావు, ఎంఆర్ఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. రంగస్థల ప్రముఖులు చింతలపూడి నాగేశ్వరరావు, డాక్టర్ రత్నశ్రీ, ఆచంట బాలాజీనాయుడు, జవహర్‌బాబులకు రంగస్థల పురస్కారాలు ప్రదానం చేశారు.

# విజయవాడ రైల్వే డివిజన్‌లో తనిఖీలు



అధికారులతో కలసి కాకినాడ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పీసీసీఎం ఇతి పాండే

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎం) ఇతి పాండే విజయవాడ డివిజన్‌లోని కాకినాడ టౌన్, తుని, నిడదవోలు స్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ముందుకు విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం బి.ప్రశాంత్‌కుమార్, కమర్షియల్ అధికారులతో కలసి ఆమే ఆయా స్టేషన్‌లలో పర్యటించి అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, సరుకు రవాణా కార్యకలాపాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కాకినాడ సీ పోర్టు ప్రైవేటు లిమిటెడ్ (కెఎస్‌పిఎల్) ప్రతినిధులతో ఆమే సమావేశయ్యారు. ముఖ్యంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో జరుగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులపై సమీక్షించారు. కాకినాడ టౌన్, తుని, నిడదవోలు స్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ప్రాంతాలు, ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ హాల్స్, టాయిలెట్‌లు, క్యాటరింగ్ స్టాల్స్‌ను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.కాకినాడ పోర్టు స్టేషన్ చేరుకుని కెఎస్‌పిఎల్ సమన్వయంతో నిర్వహించబడుతున్న యార్డ్ లేఅవుట్, షంటింగ్ నమూనాలు, వ్యాగన్‌ల నిర్వహణ, రవాణా కార్యకలాపాలను పరిశీలించా. కాకినాడ పోర్టు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే కీలకమైన సరుకు రవాణా కేంద్రమని, కెఎస్‌పిఎల్ సైడింగ్‌లు, టెర్మినల్ ఆపరేటర్ల మధ్య సమన్వయంతో వేగవంతమైన వ్యాగన్‌ల నిర్వహణ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలిని సూచించారు. విజయవాడ డివిజన్ కమర్షియల్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో గణనాథునికి అభిషేకాలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):సంకట హర చతుర్దిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం గణనాథునికి పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గణనాథుని విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ అధికారులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు , భక్తులకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ప్రతి మాసంలో వచ్చే సంకట హరచతుర్ధిన గణపతికి అభిషేకాలు, పూజలు జరిపించుకున్న భక్తులకు తాము చేపట్టే అన్ని పనుల్లో విజయం సిద్ధిస్తాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

# క్రైస్తవ్యంపై సర్కారు చిన్నచూపు

**ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం విమర్శ**



మాట్లాడుతున్న ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ్యాన్ని కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, క్రిస్టియన్ మైనార్టీలను అణగతొక్కటానికి కూటమి ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తోందని, అన్ని మతాలను సమాన దృష్టితో చూడాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం అన్నారు. స్థానిక విజయవాడ ధర్నా చౌక్‌లో బుధవారం క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పుట్టింది టీడీపీ నుంచేనని గొప్పలు చెప్పుకోవటం కాదని, అన్ని మతాలను సమాన దృష్టితో చూడాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినప్పటికీ ఇంతవరకు క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి చైర్మన్, డైరెక్టర్స్‌ను నియమించలేదన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. పాస్టర్స్‌కు 11 నెలల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, అర్హులైన కొత్త పాస్టర్‌లకు గౌరవ వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పరిధిలో చర్చిల నిర్మాణం కొరకు అనుమతులు ఇవ్వాలని, చర్చిల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. జెరూసలెం యాత్రకు నిధులు కేటాయించాలని, గ్రామాలలో సమాధుల తోట కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, పేద క్రైస్తవుల విదేశీ చదువుకు ఒక్కొక్కరికి రూ.కోటి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీసీసీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు యోవేలు రాజు, ఏఐసీఎప్ స్టేట్ కోఆర్డినేటర్ మత్తే రాజ్ కుమార్, మద్దు ప్రేమ జ్యోతి బాబు, డొక్క జార్జి తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ ట్రస్ట్ భవనం ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్ వద్ద లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన నిత్య అన్నప్రసాద వితరణ ట్రస్ట్ భవనాన్ని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజన) చౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నార్తులకు అండగా నిలుస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవినేని జోనీకుమారి అభినందనీయులన్నారు. ఈ ట్రస్ట్‌కు తన వంతు సహాయ, సహకారాలను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వక్కలగడ్డ భాస్కరరావు, మూల్పూరి ఉపేంద్ర, దేవినేని కిషోర్ కుమార్, బీజేపీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, ఎంఎస్ బేగ్, పితాని పద్మ, కె శివశర్మ తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురం సితార జంక్షన్‌లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ఫౌంటెన్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులకు స్థానిక శాసనసభ్యులు సుజనా చౌదరి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య, ఎమ్ కృష్ణ, రెడ్డిపల్లి రాజు, లింగాల అనిల్, బెవర మురళి, షేక్ మధు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.